ఆంధ్రజ్యోతి

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 ; కనిష్ఠం 23.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024



క్రీడా దుస్తులను అందజేస్తున్న పీవో చాహత్‌బాజ్‌పాయి(ఫైల్)





గిరి పుత్రుల.. సత్తా!



- జిల్లాలో ఆదివాసీ, గిరిజనుల్లోని ప్రతిభను వెలికితీస్తున్న క్రీడా పాఠశాలలు
- ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న సిబ్బంది, కోచ్‌లు
- జాతీయ, రాష్ట్రస్థాయిలో సత్తా చాటుతున్న గిరిజన విద్యార్థులు
- గత 3 ఏళ్లలో వివిధ రాష్ట్రస్థాయి పోటీల్లో 350కి పైగా పతకాలు
- జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించిన 24 మంది గిరిజన క్రీడాకారులు
- సత్ఫలితాలను ఇస్తున్న ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలు
- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉట్నూర్, జాతర్లలో ఏర్పాటు
- సరికొత్త రికార్డులతో భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్న క్రీడాకారులు

ఉట్నూర్, ఫిబ్రవరి 11: గిరి పుత్రుల్లో సహజ సిద్ధంగా దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన ఆదర్శ సంక్షేమ క్రీడా పాఠశాలలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. క్రీడా పాఠశాలల్లోని సిబ్బంది, కోచ్‌లు అధికారుల సహాయంతో శ్రమ పడి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్‌తో పాటు బోథ్ నియోజకవర్గంలోని జాతర్లలో రెండు ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈ గిరిజన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో కొత్త రికార్డులు సృష్టిస్తూ భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నారు అనడానికి ఈ పాఠశాలల సాధిస్తున్న రికార్డులు నిదర్శనం. ఈ క్రీడా పాఠశాలల పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

హాకీలో రాణిస్తున్న విద్యార్థులు

ఉట్నూర్ కొమురం భీం ప్రాంగణంలో ఉన్న గిరిజన క్రీడా పాఠశాలలో అధికారులు పట్టుబట్టి మరీ హాకీ క్రీడను పరిచయం చేశారు. రోజురోజుకూ కోచ్ వై. శేఖర్ శిక్షణలో గిరి పుత్రులు మరింత రాటుదేలుతున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు సత్తా చాటుతున్నారు. గత సంవత్సరం రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఏడవ సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టులో పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు మోతిరామ్, జగ్జీవన్, సంతోష్, యువరాజ్, మారుతి, లక్ష్మణ్, సాయిరాం, విష్ణులున్నారు. వీరికి వెండి పతకాలు లభించాయి. గత డిసెంబర్‌లో కామారెడ్డిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో 14 ఏళ్ల విభాగంలో బాలుర హాకీ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్ షిప్ దక్కించుకుంది. ఈ జట్టులో ఎనిమిది మంది గిరిజన విద్యార్థులు ఉండడం విశేషం. అదేవిధంగా వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో 17ఏళ్ల విభాగంలో ఆదిలాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలువగా.. ఐదుగురు గిరిజన విద్యార్థులు ఉట్నూర్ క్రీడా పాఠశాల వారు కావడం గమనార్హం. గత జనవరి 17 నుంచి 20 ఉట్నూర్‌లో జరిగిన ఇంటర్ సొసైటీ లీగ్ పోటీల్లో బంగారు సాధించిన జట్టులో పది మంది గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులున్నారు. అదేవిధంగా క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి పూసం మోతిరామ్ తమిళనాడులోని రామాంతపూర్‌లో, ఒడిస్సాలోని రూర్కేలాలో నిర్వహించిన జాతీయ పోటీల్లో, గ్వాలీయర్ సబ్ జూనియర్ అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాదవ్ చరణ్, సెడ్మకి ప్రమోద్, ఆత్రం శంబులు గ్వాలి యర్‌లో నిర్వహించిన జాతీయ ఎస్‌జీఎఫ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆత్రం జగ్జీవన్ రెండు పర్యాయలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. చెన్నై లో జరిగిన హాకీ జాతీయ స్థాయి పోటీల్లో క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయిరాం, యువరాజ్ సింగ్, ధనరాజ్‌లు ఆడారు. ఆత్రం సంతోష్ గ్వాలీయర్‌లో నిర్వహించిన అండర్-17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించాడు.

అథ్లెటిక్స్‌లోనూ మెరుపులు

అథ్లెటిక్స్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్రానికి ఆశాకిరణం అవుతుంది. ఉట్నూర్ జాతర్ల క్రీడా పాఠశాల గిరి పుత్రులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో పథకాలు పంట పండించడం కాకుండా కొత్త రికార్డులు నెలకొల్పుతున్నారు. ఈ ఫలితాల సాధన వెనుక కోచ్‌లు సునంద్, లక్ష్మిరామ్‌ల కృషి ఎంతో దాగి ఉంది. ఆదర్శ క్రీడా పాఠశాలల్లోని సిబ్బంది, కోచ్‌లు ఇస్తున్న శిక్షణతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. రెండు పాఠశాలలకు చెందిన అథ్లెట్లు గత మూడు ఏళ్లలో వివిధ రాష్ట్రస్థాయి పోటీల్లో 350కి పైగా పతకాలు సాధించారు. దాదాపు 24 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ఉట్నూర్ పాఠశాలకు చెందిన పెందూరు సతీష్ హనుమకొండలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జవాలిన్ త్రోలో బంగారు పతకంతో పాటు కొత్త రికార్డును నెలకొల్పాడు. ఇదే పోటీల్లో కొడప పరశురాం 600 మీటర్ల పరుగులో వెండి పతకం గెలుపొందాడు. పీ.సతీష్ కొయంబత్తూర్‌లో నిర్వహించిన జాతీయ జూనియర్ అథ్లెట్స్ మీట్లో పాల్గొన్నారు. లక్నోలో జరిగిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెట్స్ పోటీల్లో రాథోడ్ విక్రమ్, జాదవ్ శ్రీకాంత్, హెచ్‌కే నాగు, కొడప పరశురాములు 400మీటర్ల రిలే పరుగులో రజత పతకాలు గెలుపొందారు.

అథ్లెటిక్స్‌లో జాతర్ల విద్యార్థులు అదుర్స్

బోథ్ నియోజకవర్గంలోని జాతర్ల క్రీడా పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు అథ్లెటిక్స్‌లో అదరగొడుతున్నారు. తమ సత్తా చూయిస్తూ భవిష్యత్తు పై ఆశలు రేకెతిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ పాఠశాలకు చెందిన గిరిపుత్రులు 166కు పైగా పథకాలు సాధించి మెరుపులు మెరిపిస్తున్నారు నైని శ్రీకాంత్ హెక్సాథ్లన్, జావలిన్, షార్ట్‌పుట్ మూడు అంశాల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రెండు రజత పతకాలు గెలుపొందాడు. అస్సాం, కొయంబత్తూరుతో పాటు వరంగల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి మరపురాని విజయాలను నమోదు చేశాడు. మడావి సోము లాంగ్‌జంప్, హైజంప్, ట్రాయదన్ క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాడు. కొయంబత్తూరు, అస్సాం, వరంగల్, పాట్నాలలో జరిగిన ఈ పోటీల్లో మూడు వెండి పతకాలు గెలుపొందాడు. శర్మలింగు వరంగల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో జవాలిన్ త్రోలో వెండి పతకం సాధించాడు. మెస్రం జగ్జీవన్ కూడా ఈ పోటీల్లో పాల్గొన్నాడు. పాఠశాలకు చెందిన చంద్రకాంత్ ప్రవీణ్‌లు సైతం పాట్నాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన అర్జున్ వాలీబాల్‌లో రెండు పర్యాయాలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

ఖోఖోలోనూ నెంబర్ వన్

గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల ఉట్నూర్ విద్యార్థులు ఖోఖో క్రీడల్లోనూ రాష్ట్రం లోనే నెంబర్ వన్‌గా నిలుస్తున్నారు. రన్నింగ్ ఛేజింగ్‌లలో ప్రత్యర్థి జట్లకు అందనంత ఎత్తుకు దూసుకు వెళ్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు.. జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టుకు విజయాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కోచ్ శివకృష్ణ శిక్షణలో మీరు మెరికల్లా తయారవుతూ జిల్లాకి గర్వకారణంగా నిలుస్తున్నారు. ఉట్నూర్ క్రీడా పాఠశాలకు చెందిన నరేష్, నవీన్ కుమార్, అంజన్నలు నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా బెంగళూరులో నిర్వహించిన 33వ జాతీయ సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో నవీన్‌కుమార్, నిర్మల్ కుమార్, సురేం దర్, శంకర్‌లు పాల్గొనడమే కాదు.. రజత పతకాలు కైవసం చేసుకున్నారు. అం తేకాకుండా చాలా ఏళ్ల తర్వాత జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన రాష్ట్రం లోని ఖోఖో జట్టుకు నాయకత్వం వహించడం గమనార్హం.

క్రీడా విద్యార్థుల కోసం ప్రత్యేక డైట్

: దిలీప్‌కుమార్, డీడీటీడబ్ల్యూ, ఉట్నూర్

ఉట్నూర్, జాతర్లలో ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక డైట్ అమలు చేస్తున్నాం. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రోజుకు 37 రూపాయలు డైట్ కోసం ఖర్చు పెడుతుంటే.. క్రీడా విద్యార్థులకు రోజుకు రూ.87 ఖర్చు పెడుతున్నాం. క్యాటరింగ్ ద్వారా విద్యార్థులకు మేలు రకమైన భోజనం అందించే ఏర్పాట్లు చేశాం. తమ పాఠశాలల క్రీడాకారులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాకు పేరు తెస్తున్నారు.



సంక్షిప్త సమాచారం



పిప్పల్‌కోటిలో త్రిశూలంను ఊరేగిస్తున్న గంగ పుత్రులు, కుటుంబీకులు

శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ

భీంపూర్, ఫిబ్రవరి 11: భీంపూర్ మండలం పిపల్‌కోటిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ఆదివారం శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో గంగా పుత్రల సంఘం ఆధ్వర్యంలో మహారాష్ట్ర పాండర్ కవడలో ప్రత్యేకంగా తయారుచేయించిన త్రిశూలంను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి శివాలయంలో అందించి ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. అలాగే ఆలయం నిర్మాణం కోసం రెండు లక్షల రూపాయిల విరాళం అందించిన ప్రముఖ న్యాయవాది కేమా శ్రీకాంత్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కాగా డిసిసిబి ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, తదితరులు పాల్గొన్నారు.

- భక్తిశ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మ విగ్రహం..

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మ విగ్రహాన్ని డప్పులు భాజాల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ గ్రామస్థులు మహిళలుపాల్గొన్నారు.

నేడు గ్రామ సభ

బోథ్, ఫిబ్రవరి 11: గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు కార్యదర్శి పుల్కం అంజయ్య తెలిపారు. సమావేశాన్ని సోమవారం ఉదయం 12 గంటలకు నిర్వహిస్తున్నామని సమావేశానికి ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు హాజరు కావాలని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణంలో నెలకొన్న కుక్కల బెడదకు చేపట్టవలసిన నివారణ చర్యలపై వచ్చే వేసవిలో నీటి ఎద్దడి నివారణకు, వ్యక్తిగత నీటి కనెక్షన్ డిపాజిట్ రసుము, పంచాయతీ ట్రాక్టర్లకు బ్లేడ్ కొనుగోలు తదితర అంశాల పై చర్చించడం జరుగుతున్నందున సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బోథ్ సీఐ, ఎంపీడీవోల బదిలీ

బోథ్, ఫిబ్రవరి 11: బోథ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న భీమేష్ ఇచ్చోడ సీఐగా బదిలీ అయ్యారు. బోథ్ సీఐగా మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ సీఐగా పని చేసిన బానోత్ రమేష్‌ను బోథ్ సీఐగా బదిలీ చేశారు. కాగా బోథ్ ఎంపీడీవో సుశీల్‌రెడ్డిని నిర్మల్ జిల్లాకు బదిలీ చేయగా.. కొత్త ఎంపీడీవోకు సంబంధించి ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.



బాన్‌పేన్ పూజలకు గోవ్వాడ్ నుంచి కొత్త కోడళ్లు



కోనేరు నీటితో తరలి వస్తున్న కొత్త కోడళ్లు



కోనేరు వద్ద పూజలు చేస్తున్న కొత్త కోడళ్లు

ఆదివాసీల పూజలతో పులకరించిన అడవితల్లి

- పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు మెస్రంల ప్రత్యేక పూజలు
- నాగోబా దర్శనానికి బారులు తీరిన భక్తులు
- నేడు కేస్లాపూర్‌లో గిరి దర్బార్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 11: ఆదివాసీల సంస్కృతీ, వారసత్వ సంపదకు ప్రతిరూపంగా నిలిచే మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర భక్తుల సందడితో కిటకిటలాడుతోంది. ఆదివారం మూడో రోజు జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి చేరుకున్న మెస్రం వంశస్థులు నాగోబాకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివాసీలకు అనాధిగా వస్తున్న ఆచార, వ్యవహారాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించడంతో నాగోబా ప్రాంగణం పులకరించిపోతోంది. ఒకేచోట బస చేసిన మెస్రం వంశస్థుల ఆత్మీయ పలకరింపులు, కుశల ప్రశ్నలతో ముచ్చట్లతో గడిపారు. గోవాడ వద్ద పూజలు నిర్వహించారు.

పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు ప్రత్యేక పూజలు

నాగోబా ప్రధాన ఆలయం వెనుక మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో పెర్సాపేన్, బాన్ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. డోలు, పెప్రే, కాలీకోమ్ వాయిస్తూ ఘనంగా పూజలు నిర్వహించారు. కొత్తగా బేటింగ్ (పరిచయం) అయిన కోడళ్ల మర్రి చెట్టు వద్ద ఉన్న బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చారు. బాన్ దేవత ఆలయం ముందు ఉన్న పాత పుట్టను తొలగించారు. పవిత్ర జలంతో మెస్రం వంశీయులు పాత భాన్ దేవతల ప్రతిమలను శుద్ధి చేశారు. కోడళ్ల కొత్త పుట్టలను తయారు చేసి భాన్ దేవతకు పూజలు చేశారు.

నాగోబా జాతరలో గిరి దర్బార్

ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద గిరిజన ఉత్సవంగా నాగోబా జాతరను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం భక్తులకు తాగునీరు, ఇతర కనీస వసతులు కల్పించగా.. ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. అయితే జాతర ఉత్సవంలో అత్యంత ప్రధానంగా భావించే గిరి దర్బార్ సోమవారం నిర్వహించాలని నిర్ణయించారు. భారీ సంఖ్యలో గిరిజనులు హాజరయ్యే దర్బార్ కోసం ఏర్పాట్లు గావించారు. 1946లో కేస్లాపూర్ జాతరను సందర్శించిన మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్ సూచన మేరకే అప్పటి నిజాం ప్రభుత్వం గిరిజనుల సమస్యల పరిష్కార వేదిక కోసం ప్రత్యేకంగా దర్బార్‌ను ప్రారంభించింది. గిరిజనుల చెంతకు అధికారులు, ప్రజాప్రతినిధులే వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని, అప్పటి ప్రభుత్వం సూచించడంతో.. ఇప్పటి వరకు యధావిధిగా 78 ఏళ్ల నుంచి గిరి దర్బార్ కొనసాగుతోంది. మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతూ వస్తున్నారు. సోమవారం జరిగే దర్బార్‌తో పాటు జాతర ఉత్సవాల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినంగా వర్తిస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.



బాన్‌పేన్ పూజల్లో పాల్గొన్న కొత్త కోడళ్లు


పేదల భూములను ఆక్రమిస్తే ఖబడ్దార్

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 11: ఆదిలాబాద్‌లో పేదలకు కేటాయించిన సర్వే నెం.170లో కొందరు నాయకులు పేదల భూములను కబ్జాలు చేస్తున్న విషయం పై ఎమ్మెల్యే పాయల శంకర్ తీవ్రంగా స్పందించారు. పేదలకు కేటాయించిన భూములను కబ్జా చేస్తే ఖబర్దార్ అని అన్నారు. ఈ విషయమై బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే కఠినంగా వ్యవహరించేలా ఆదేశాలు ఇస్తామన్నారు.

- బీసీ సంఘ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్: గతపాలకుల హాయంలో బీసీ కులాలు అణిచి వేయబడ్డాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా బీసీ కుల సంఘాల భవన మొదటి అంతస్తును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీలో ఉన్నప్పుడు తన అనుభవాలను పంచుకున్నానన్నారు. ఒక బీసీ కులస్థుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి ఎన్ని కష్టాలు పడాల్సి వచ్చిందో ఆయన గుర్తు చేశారు. జైనథ్ మండల అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జోగు రామన్న ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే ఒక దశలో ఆయన మనం గెలుస్తామా? అని భయపడ్డారని కానీ వారికి వెన్నంటి ఉండి వారిని గెలిపించడంలో బీసీ కులస్థులందరు ఒకటయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘ జాతీయ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, బీసీ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహకులు శ్రీనివాస్, బీసీసంఘ నాయకులు కళాల శ్రీనివాస్, చిక్కాల దత్తు, నరసాగౌడ్, కాసర్ల శ్రీనివాస్, దాముల రవీందర్, జక్కుల శ్రీనివాస్, నవీన్‌యాదవ్, ఆదినాథ్, జ్యోతి, నాయకులు జిల్లా బీసీ కుల సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్థానిక సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు



బీసీ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల



చలి బోనాలతో శోభాయాత్రగా తరలి వెళ్తున్న మహిళలు

ఉట్నూర్‌లో ఘనంగా చలి బోనాలు

ఉట్నూర్, ఫిబ్రవరి 11: వేసవి కాలం సమీపిస్తుండడంతో చలికాలం అంతమవుతోందని భావిస్తున్న ప్రజలు గ్రామ దేవతలైనా పోచమ్మలకు చలి బోనాలు సమర్పిస్తున్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పోచమ్మ వాడలో ఉన్న పోచమ్మ దేవాలయానికి గ్రామానికి చెందిన మహిళలు చలి బోనాలు నెత్తి పెట్టుకుని శోభాయాత్ర ద్వారా ఆలయానికి చేరుకున్నారు. పోచమ్మ దేవతకు చలి బోనాలు సమర్పించి పట్టణంలోని ప్రజలందరు సుఖసంతోషాలతో, ఎలాంటి వ్యాధుల బారీన పడకుండా ఉండాలని మొక్కుకున్నారు. అలాగే పాత ఉట్నూర్, గంగన్నపేట, లక్కారం, షాంపూర్, హస్నాపూర్, చాందోరి, దంతనపల్లి, బీర్సాయిపేట, తదితర గ్రామాలలో గ్రామదేవతలకు చలి బోనాలు సమర్పించారు.

ముగిసిన బాజీరావ్ బాబా సప్తాహం

జైనథ్, ఫిబ్రవరి 11: మండలంలోని నిరాల గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న బాజీరావ్ బాబా సప్తహం వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ దేవతల వేషాదారణతో కూడిన పిల్లలను రంగురంగులతో ఏర్పాటు చేసి ఎడ్లబండి పై కూర్చొబెట్టారు. దీంతో బాజీరావ్ బాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి డప్పులు భాజాల మధ్య ప్రధాన వీధుల గుండా మహిళలు, భక్తులు నృత్యాల మధ్య భాజాల శోభయాత్ర నిర్వహించారు.



రికార్డును పరిశీలిస్తున్న డీఐఈవో పరుశురామ్

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రం తనిఖీ

భైంసా, ఫిబ్రవరి 11: పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాలలోని ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని ఆదివారం జిల్లా ఇంటర్ విద్యాధికారి పరుశురామ్ తనిఖీ చేశారు. డీఈసీ రవి కిరణ్‌తో కలిసి భైంసాలోని ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రాక్టికల్ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. విద్యార్థుల రికార్డు రాత పుస్తకాలను పరిశీలించారు. లోపాలకు తావు లేకుండా ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని పరీక్షా కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మూడు విడుతలలో ఈనెల 1న ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 15న ముగియనున్నట్లుగా డీఐఈవో పరుశురామ్ వెల్లడించారు.



మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చేందుకు కృషి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి11: ప్రణాళికా బద్ధమైన విధానాల ద్వారా భైంసాలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం ఏరియా ఆసుపత్రిలో జరిగిన సలహా సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ విషయమై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, కమీషనర్‌తో కలిసి వినతి పత్రం అందించి మాట్లాడటం జరిగిందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు అందింపచేసేందుకు కృషి చేస్తున్నట్లుగా వివరించారు. ఇందులో భాగంగానే ఆసుపత్రిలో పూర్తిస్థాయి వసతులు, సౌకర్యాలతోకూడిన మూడు అపరేషన్ థియేటర్లను సిద్ధం చేస్తున్నట్లుగా పెర్కొన్నారు. అంతేకాకుండా లాప్రోస్కోపిక్ అపరేషన్ల నిర్వాహణకు అవసరమైన పరికరాల సమకూర్చేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇదే క్రమంలో అవుట్ పెషెంట్ రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించేందుకు 8గదులను ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మేరనిధులు కేటాయించని పక్షంలో తన ఫండ్‌తోపాటు దాతల సహకారం తీసుకుంటామని పెర్కొన్నారు. రోగుల సౌకర్యార్థం రూ.43 లక్షలతో ఆసుపత్రి అవరణలో అక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించినట్లుగా తెలిపారు. ఆసుపత్రిలోని వైద్యులందరూ విధిగా సమయపాలన పాటిస్తూ అంకితభావంతో రోగులకు సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా.కాశీనాథ్, లయన్స్ క్లబ్ భైంసా అధ్యక్షుడు అరవింద్ కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

● మహాలక్ష్మి పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ముథోల్: మండలంలోని తరోడా గ్రామంలో గల మహాలక్ష్మి పోచ మ్మ ఆలయ పునఃప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావుపటేల్ పాల్గొని పూజలు చేశారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు, నాయకులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సాయశక్తులా కృషిచేస్తానన్నారు. భక్తిభావంతోనే గ్రామాల్లో ఐక్యత భావం పెంపొందుతుంద న్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ నర్సాగౌడ్, ఎంపీటీసీ గంగాధర్, బాసర జడ్పీటీసీ వసంత రమేష్, మాజీ సర్పంచ్ రామచందర్, నాయకులు రవి గౌడ్, సాయిలు, శ్రీధర్ పటేల్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: ఐఎఫ్‌టీయూ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 11: ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న, పిలుపునిచ్చారు. ఆదివారం భగత్‌సింగ్ భవనంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రామలక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా రైతాంగ, కార్మిక సమస్యలు పరిష్కరించలేకపోయిందని ఆరోపించారు. కనీస వేతనాలు నిర్ణయించే ప్రక్రియకు స్వస్తి పలికిందని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారాని కోసం దేశవ్యాప్త సమ్మెలో అధి క సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి11: నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1993-96 బీఎస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యనందించిన గురువులను సత్కరించారు. పూర్వవిద్యార్థి మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, శ్రావణ్, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొని గత స్మృతులను తలుచుకుని సంతోషగా గడిపారు.



1993-96 బీఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చెకుముఖిలో తాంసి విద్యార్థినుల ప్రతిభ

● రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం

తాంసి, ఫిబ్రవరి 11: రాష్ట్రస్థాయి చెకుముఖి పోటీల్లో తాంసి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు ప్రతిభ చాటి మూడువ స్థానానికి చేరుకున్నారు. ఆదివారం జనగామలో నిర్వహించిన రాత పరీక్షలో తాంసి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పల్లవి, బిందుజ, శివప్రియ మూడవ స్థానాన్ని సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థినిలు జిల్లా నుంచి ఎంపికై రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని పొందారు. ప్రభుత్వ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానాన్ని సంపాదించడంతో మండల వాసులతో పాటు యువకులు, గ్రామస్తులు వారిని అభినందించారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, పవన్ రవి, తదితరులు ఉన్నారు.



ఇచ్చోడలో గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న చిన్నారులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకులాల ఆర్‌సీవో గంగాధర్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ, ఫిబ్రవరి 11: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందడానికి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇచ్చోడలో పలు పాఠశాలల్లో నిర్వహించిన వీటీజీ సెట్ (తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష) ప్రశాంతంగా ముగిసింది. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 816 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 785 మంది విద్యార్థులు హాజరైనట్లు గురుకులాల ఆర్‌సీఓ గంగాధర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్‌లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో గురుకు లాల్లో ప్రవేశం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్‌లో 2727 మంది విద్యార్థుల కోసం 8 కేంద్రాలను ఏర్పాటు చేసి మౌళిక వసతులను కల్పించారు. ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద విద్యార్థులు తమ హాల్ టికెట్లను సరి చూసుకున్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఆయా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. వీరిని సిబ్బంది పరిశీలించి లోనికి అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట



ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 11: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివారం మండలంలోని హీరాపూర్, లక్ష్మీపూర్, గోపాల్‌పూర్, మచ్చాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావించి కేంద్ర ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం సీసీ రోడ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.14 లక్షలతో సీసీ రోడ్డు మంజూరు చేయించిన ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోడం నాగోరావు, రగల్ జెండా ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తోడసం నాగోరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ వసంత్‌రావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రారంభిస్తున్న ఎంపీ

బావిలో పడి రైతు మృతి : ఎస్సై

తలమడుగు, ఫిబ్రవరి 11: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన నాయిని లింగన్న(55)అనే రైతు బావిలో పడి మృతి చెందినట్లు తలమడుగు ఎస్సై ధనశ్రీ తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన నాయిని లింగన్న అనే రైతు శనివారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా సాయంత్రం రాత్రి అయిన ఇంటికి రాక పోవడంతో కుటుంబీకులు గ్రామస్థులతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లగా పొలంలో గల బావి వద్ద లింగన్న చెప్పులు కనబడడంతో గ్రామస్థుల సహకారంతో బావిలో వెతకగా లింగన్న మృతదేహం కనబడడంతో వెంటనేకుటుంబీకులు తలమడుగు పోలీసులకురైతు లింగన్నను పాతకక్షల కారణంగా బావిలో చంపి పారేశారనికుటుంబీకులు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకుని మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య పిల్లలున్నారు. కాగా నాయినిలింగన్న మృతికి కారుకులైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరారు.

నిప్పంటించుకొని వృద్ధురాలి ఆత్మహత్య

మావల, ఫిబ్రవరి 11: నిప్పంటించుకొని ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం.. పట్టణంలోని దుర్గ నగర్‌కి చెందిన రుక్మాబాయి(70) తన కోడలు, మనవడితో కలిసి ఉంటుంది. తన కొడుకు, కూతురు ఇటీవల మరణించడంతో తీవ్ర మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో శనివారం మంచంపై ఉన్న బట్టలకు నిప్పంటించుకుంది. వృద్ధురాలిని రిమ్స్‌కి తరలించగా.. ఆదివారం మృతి చెందింది. మనవడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిపై కొడుకు దాడి

మావల, ఫిబ్రవరి 11: తల్లిపై కొడుకు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ రూరల్ పరిధిలోని రణధీర్‌నగర్ కాలనీకి చెందిన జాదవ్ దినేష్, జాదవ్ జితేందర్‌లు అన్నదమ్ముళ్లు. వీరి మధ్య కూలి డబ్బులు పంపిణీ విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. తల్లి రేణుక సముదాయించగా.. జితేందర్ తల్లిపై దాడి చేశాడు. తల్లి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై సయ్యద్ ముజామిద్ కేసు నమోదు చేశారు.

'వేతనాలు సకాలంలో అందించాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 11: వేతనాలు సకాలంలో అందించక పోవడంతో ఉట్నూర్ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. విధులకు హాజరవుతునే నాలుగు రోజులుగా ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్నారు. ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ నిరసన కార్యక్రమాలు ఆదివారం నాటికి నాలుగో రోజు చేరుకున్నాయి.రాష్ట్ర కోశాధికారి బొంకంటి సుభాష్ ఆధ్వర్యంలో మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేసి ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో బానుప్రసాద్, వెంకటేశ్, సూర్య, రాకేష్, జ్యోత్స్న, రమేష్, అరుణ్, ఎన్‌హెచ్ఎం సిబ్బంది, పారామెడికల్ స్టాఫ్ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

వైజాపూర్‌లో కిసాన్ మేళా

గుడిహత్నూర్, ఫిబ్రవరి 11: మండలంలోని వైజాపూర్‌లో ఆదివారం ఐసీఏఆర్ క్రీడా ఆధ్వర్యంలో కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో నూతన మెలకువలు పాటించాలని, ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని సూచించారు. హాజరైన పలువురు శాస్త్రవేత్తల వివిధ రకాల పంటలు, కూరగాయాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మనోరంజన్, నర్సింలు, అశోక్‌కుమార్, సమంత, శ్రీధర్, రాంప్రసాద్, ప్రవీణ్ కుమార్, శ్రీధర్ చౌహన్, మూర్తి, మండల వ్యవసాయ శాఖ అధికారి రేవతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీఏఆర్ డైరెక్టర్ వీకే సింగ్

క్రీడల్లో గెలుపోటములు సహజం : చైర్మన్

మావల, ఫిబ్రవరి 11: క్రీడలలో గెలుపోటములు సహజమని ఈ క్రీడాల ద్వారా స్నేహానుబంధాలను పెంపొందించు కోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు.ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో జోగు ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న టెన్నీస్‌బాల్ టోర్నమెంట్ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్రం రాజు, పరమేశ్వర్,రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జై జంగో.. జై లింగో దీక్షలు

బోథ్, ఫిబ్రవరి 11: రెండు నెలల కాలంగా చేపట్టిన జంగుబాయి దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఆదివాసీల ఆరాధ్య దైవం అయిన జంగుబాయి దీక్షలను కఠోర నియమ నిబంధనలతో పాటించారు. రెండు నెలల దీక్షలు ముగియడంతో మాలలు తీసివేశారు. మండలంలోని ఆదివాసీ గూడెలన్నీ రెండు నెలల కాలంగా ఆధ్యాత్మిక శోభతో వెల్లువిరిశాయి.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

భైంసారూరల్, ఫిబ్రవరి11: మండలంలోని కోతుల్‌గాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో వారి వద్ద నుంచి రూ.42,590 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో అధికారుల బదిలీలు షురూ..

● డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు తహసీల్దార్లు, నలుగురు సూపరింటెండెంట్ల బదిలీ ● 14 ఎంపీడీవోలకు స్థానచలనం

భైంసా, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు బదిలీలు మొదలయ్యాయి. శనివారం రెవెన్యూశాఖలో బదిలీల ప్రక్రియ చోటు చేసుకోగా ఆదివారం ఎంపీడీవోల బదిలీలు జరిగాయి. జిల్లాలోని 14మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. ఇందులో మంచిర్యాల జిల్లాకు ముగ్గురు, ఆదిలాబాద్ జిల్లాకు నలుగురు, నిజామాబాద్ జిల్లాకు ఏడుగురు ఎంపీడీవోల బదిలీ జరిగింది. జిల్లాలోని వివిధ మండలాల్లో ఎంపీడీవోలుగానున్న జి మోహన్‌రెడ్డి, ఎల్.రమేష్, జి.గోపాల్ కృష్ణారెడ్డి, ఎస్.శేఖర్‌లు ఆదిలాబాద్ జిల్లాకు, ఎం. దేవేందర్‌రెడ్డి, ఎం.మోహన్, సరోజలు మంచిర్యాల జిల్లాకు, బి.శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు, ఎ.నాగ్‌నాథ్, సాయిరామ్, వనజ, టి.సురేష్‌బాబు, కె.విజయ్ భాస్కర్ రెడ్డిలు నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.

● రెవెన్యూ శాఖలో..

పార్లమెంట్ ఎన్నికల బదిలీల్లో రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగాయి. జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గానున్న వి.లోకేశ్వరరావ్ అసిఫాబాద్ జిలాకు బదిలీ అయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్‌లుగానున్న కె.గజానన్ , డి.కిరణ్మయిలు నిజామాబాద్ జిల్లాకు,ఎస్.హెచ్ సత్యనారాయణ ఆదిలాబాద్ జిల్లాకు, ఆర్.శ్రీనివాస్ జగిత్యాల్ జిల్లాకు బదిలీ అయ్యారు .ఇక తహసీల్దార్ల బదిలీల్లో లక్ష్మణ్‌చాంద తహసీల్దార్ కె.సరిత, దిలావర్‌పూర్ తహసీల్దార్ డి.సరితలు నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. వివిధ మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లుగానున్న వి.గంగాధర్, ఎం.తెలంగ్‌రావ్, జె.ప్రకాష్, బాబు సింగ్‌లు నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ బదిలీలు జరుగనున్నట్లుగా సమాచారం.

అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

● నేరస్థులకు సత్వరమే శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు కృషి ● ఈ అంశంపై ఎస్పీతో చర్చించా: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మూడేళ్ల బాలుడు రియాన్ష్ గాయాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, ఫిబ్రవరి 11: అలేఖ్య హత్య కేసులో నేరస్థులకు సత్వరమే శిక్షపడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరతానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం ఖానాపూర్ అంబేడ్కర్ నగర్‌లోని అలేఖ్య నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే బొజ్జు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాంత్ చేసిన దాడిలో గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మూడేళ్ల బాలుడు రియాన్ష్ గాయాలను పరిశీలించారు. తీవ్ర గాయాలతో ఇంకా ఆసుపత్రిలోనే ఉన్న జయశీల ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తమ బిడ్డకు జరిగిన అన్యాయం మరో ఆడబిడ్డకు జరగొద్దంటే హంతకుడికి అతనికి సహకరించిన వారిందరికీ ఉరి శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అలేఖ్య తల్లిదండ్రులు గంగవ్వ గంగారాం, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జు కచ్చితంగా ఈ హత్యను ఇటు ప్రభుత్వంతోపాటు అటు సమాజంలోని ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ఇదివరకే ఈ హత్యపై తాను జిల్లా ఎస్పీతో మాట్లాడాన ని తెలిపారు. జరిగిన ఘటనలో నిందితులకు కఠినంగా శిక్ష పడేలా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డిలతో మాట్లాడి ఖచ్చితంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మండల నాయకులు మ్యాదరి రాజేశ్వర్, సార్ల నర్సయ్య, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, తదితరులున్నారు.

అలేఖ్య హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

● హంతకుడికి సహకరించినందుకు శ్రీకాంత్ తల్లి, తమ్ముడిని రిమాండ్ చేసిన పోలీసులు


ఖానాపూర్, ఫిబ్రవరి11: రాష్ట్రంలో సంచలనంగా మారిన అలేఖ్య హత్య కేసులో పోలీసులు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సీఐ మోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 8న అలేఖ్యను నడి రోడ్డుపై శ్రీకాంత్ నరికి చంపాడని, అతడి తల్లి సత్తవ్వ, తమ్ముడు శివకృష్ణ అలియాస్ నాని సహకరించినట్లు తేలడంతో వీరిరువురిని బాధనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద పట్టుకొని విచారించగా వారు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో విచారణ కొనసాగుతుండదని ఆయన పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

దస్తూరాబాద్, ఫిబ్రవరి11: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆకొండపేట్, మున్యాల్, బుట్టాపూర్, రేవోజిపేట్, గొడిసిర్యాల్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కా రం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో రోడ్డు, నీటి, కరెంటు సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రె స్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుండా నరేష్, మండల నాయకులు పులియ నాయక్, తిప్పని రామన్న, మాణిక్, వర్దెల్లి గోపాల్, రమేష్ రావు, కొమురయ్య, మహేందర్ రెడ్డి, దశరథ్ ఆనంద్, రాజేందర్, శ్రీధర్, వెంకటేష్, నాగన్న, రాజన్న, నాగరాజు, ప్రేమ్ సాగర్, ప్రసాద్, బబ్లు, వెం కన్న, వెంకటేష్, మల్లికార్జున, అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముథోల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ముథోల్, ఫిబ్రవరి 11: ముథోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎడ్‌బిడ్‌లో జిల్లాస్థాయి కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ జూనియర్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు సరయు, వికాస్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ అభినందించారు. ఈ నెల 16 నుంచి సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



● కడెం ప్రాజెక్టు (ఫైల్)

● గత ఏడాది వర్షాకాలంలో భారీగా నీరు చేరడంతో ఓవర్ ఫ్లో అయ్యి ప్రాజెక్టు పైనుంచి పొంగుతున్న వరద (ఫైల్)

● ప్రాజెక్టు గేట్ల మధ్యలో ఇరుక్కున్న చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

● కడెం ప్రాజెక్టు వద్ద జరిగిన నష్టాన్ని పరిశీలిస్తున్న డ్యామ్ సేఫ్టీ అధికారుల బృందం (ఫైల్)

వానాకాలం సీజన్ వరకైనా..

కడెం సిద్ధమయ్యేనా?

- రూ.5.5 కోట్లతో మరమ్మతులకు టెండర్లు
- ఈ నెలాఖరుకు ముగియనున్న టెండర్ల ప్రక్రియ
- మరో నాలుగు నెలల్లో రానున్న వర్షాకాలం
- కడెంకు ప్రతీ ఏడాది 6 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు
- భారీ వరదను తట్టుకునేందుకు డ్యామ్ పనికిరాదన్న డ్యామ్ సేఫ్టీ రివ్యూ బృందం
- 100 మీటర్ల దిగువన కొత్త గేట్లతో స్పిల్ వే నిర్మించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి సూచన
- ఇంకా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ప్రాజెక్టు మరమ్మతు పనులు


ప్రాజెక్టును పరిశీలిస్తున్న డ్యామ్ అధికారులు

ఖానాపూర్, ఫిబ్రవరి11: గత రెండేళ్లుగా వర్షాకాలం భారీ వరద నీరు చేరుతుండడంతో కడెం ప్రాజెక్టు వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వదర ఉధృతికి ప్రాజెక్టు ఉం టుందో, లేదో తెలియని భయంకరమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. గత ఏడాది వర్షాకాలంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల నుంచి సురక్షితం గా కడెం ప్రాజెక్టు బయటపడిన తర్వాత ప్రాజెక్టు వద్దకు పలు కేంద్ర, రా ష్ట్ర బృందాలు వచ్చి ప్రాజెక్టును పరిశీలించాయి. ఆ తర్వాత ప్రాజెక్టు మర మ్మతులు, స్పిల్‌వే పునర్నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు అందించాయి. ఈ నివేదికల ఆధారంగా కడెం ప్రాజెక్టు ఇక భవిష్యత్తులో వచ్చే వరదలను తట్టుకుని నిలవడం కష్టమని తేల్చిన అధికారులు మరో స్పిల్‌వే నిర్మించాలని సూచించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రాజెక్టు రెండోసారి వరద ముంపునకు గురై 5నెలలు కావస్తున్నా 'కొత్త స్పిల్‌వే' మాట దేవు డెరుగు కానీ మరమ్మతులే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారయ్యాయి. దీంతో ఈ ఏడాది యాసంగి క్రాప్ హాలిడే ప్రకటించారు. ఇప్పటివరకు మరమ్మతులు ప్రారంభం కాకపోవడంతో ఈ వానాకాలం సాగు వరకైనా కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● రూ. 5.5 కోట్లతో మరమ్మతులకు టెండర్లు

గత రెండేళ్లుగా భారీ వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపగా గత ఏడాది డిసెంబరులో రూ.5.5కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో మరమ్మతు పనులను చేపట్టేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది. ఈ ప్రక్రియ ఈనెల చివరి వారం ముగుస్తుందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది వానాకాలంలో కడెం ప్రాజెక్టు 18 గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రాజెక్టు వద్ద కౌంటర్ వెట్, రోప్స్, రోలర్స్, గేర్ బాక్స్, బేరింగ్స్, ఎలక్ట్రికల్ ప్యానల్స్, ప్లంబర్ బాక్స్, రబ్బర్ సీల్స్‌తోపాటు ఇతరత్రా మెకానికల్ సిస్టం దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనులన్నింటినీ పూర్తిచేసి వానాకాలం సీజన్‌కు ముందే ప్రాజెక్టును సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

● క్రాప్ హాలిడేలో రైతులు

కడెం ప్రాజెక్టు దిగువ 68 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. అధికారికంగా 68 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కడెం ప్రాజెక్టులో పుష్కలమైన నీరు ఉంటే అదనంగా మరో 30 నుంచి 40వేల ఎకరాలకు లబ్ధి జరుగుతుందని ఈ ప్రాంత రైతులు చెప్తున్నారు. ఖానాపూర్‌తోపాటు మంచిర్యాల నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కడెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతోంది. కడెం ప్రాజెక్టు ద్వారా ప్రతీఏడాది వానాకాలం, యాసంగి పంటల కోసం కడెం, దస్తురాబాద్, జన్నారం, హాజీపూర్, దండేపల్లి, లక్షెటిపేట మండలాల రైతాంగానికి సాగునీటిని అందిస్తున్నందున ఈ ప్రాంతాల రైతులకు ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు లేనందున క్రాప్ హాలిడే ప్రకటించారు. కడెం ప్రాజెక్టు పూర్తి నీటి నిలువ సామర్థ్యం 7.6 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.4 టీఎంసీల నీరు మాత్రమే ప్రాజెక్టులో నిలువ ఉంది. కాగా ఇందులో 2.70ఎంసీల నీరు డెడ్ స్టోరేజ్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

● కొత్త స్పిల్ వే ఏర్పాటు ఎప్పుడో?

గత ఏడాది వర్షాకాలంలో వచ్చిన భారీ వరదలకు ప్రాజెక్టులోకి ఆరు లక్షలకు పైగా క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుత కడెం ప్రాజెక్టు 3.72లక్షల క్యూసెక్కుల నీటి ఉధృతిని మాత్రమే తట్టుకుంటుందని అధికారులు చెప్తున్నారు. దీంతో గత ఏడాది జూలైలో కడెం ప్రాజెక్టును న్యూఢిల్లీకి చెందిన డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ సెంటర్ బృందం సందర్శించింది. ఈ సమయంలో సదరు బృందం అధికారులు అన్ని అంశాలను పరిశీలించి ఇక భవిష్యత్తులో వచ్చే వరదలను తట్టుకొని కడెం ప్రాజెక్టు నిలువలేదని నిర్ధారించారు. అదే నివేదికను అప్పటి తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. దీంతో అప్పటి ప్రభుత్వం కడెం ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు హైపవర్ ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించింది. సదరు హైపవర్ ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా కడెం ప్రాజెక్టు భవిష్యత్తులో వరదలను తట్టుకొని నిలబడే పరిస్థితిలో లేదని నిర్ధారించి ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేసింది. పైరెండు కమిటీలు కడెం ప్రాజెక్టు ఇక భవిష్యత్తులో వరదలను తట్టుకొని నిలువలేదని నిర్ధారించి 100 మీటర్ల దిగువన కొత్త స్పిల్ వేను ఏర్పాటు చేయాలని సూచించాయి. ఈ స్పిల్ వే నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో స్థానిక అధికారులు అధ్యయనం చేసి కోర్ డ్రిల్లింగ్ రిజల్ట్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఇంజనీర్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్‌కు పంపింది. దీనిపై ఇంకా సీఈసీడీవో ఎటువంటి డిజైన్ రూపకల్పన చేయకపో వడంతో స్పిల్ వే నిర్మాణం అంశం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు గా మారిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. 100 మీటర్ల దిగువన స్పిల్ వే నిర్మాణం జరిగితే డ్యామ్ సుమారు ఐదు లక్షల క్యూసెక్కులకు పైగా వరద ఉధృతిని తట్టుకుంటుందని చెబుతున్నారు. దీంతో కడెం ప్రాజెక్టు కొత్త స్పిల్ వే నిర్మాణం ఎప్పుడు జరుగుతోందనని ఈ ప్రాంత రైతుల్లో ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.

కడెం ఆయకట్టుకు నీరందేలా చర్యలు చేపట్టాలి



● నంది రామయ్య, ఉమ్మడి జిల్లా కార్యదర్శి, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా

గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతోనే కడెం ప్రాజెక్టు ప్రస్తుతం కూలిపోచే పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వంలోనైనా కడెం ప్రాజెక్టు మరమ్మతులతోపాటు ఆధునీకరణ వేగవంతం చేయాలి. రానున్న ఖరీఫ్‌కి కచ్చితంగా సాగునీటిని అందించాలి.

త్వరలోనే మరమ్మతు పనులు పూర్తి చేస్తాం..

● భోజదాస్, డీఈ, కడెం ప్రాజెక్టు

రానున్న ఖరీఫ్‌లోపు ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తిచేస్తాం. రూ.5.5 కోట్లతో ఇప్పటికే మరమ్మతు పనులకు టెండర్లు పిలిచాం. ఈ నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తి చేసి వేగవంతంగా మరమ్మతు పనులు పూర్తి చేసి ఖరీఫ్‌కు నీరందిస్తాం.

నేటి నుంచి బాసరలో వసంత పంచమి వేడుకలు


బాసర సరస్వతి అమ్మవారు

బాసర, ఫిబ్రవరి 11: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి వసంత పంచమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మొదటిరోజు సరస్వతి అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ, చండ సహిత అష్టోత్తర, శతకళశ, మహా అభిషేక సంకల్పం, గణపతి పూజ, అష్టోత్తర కలశ స్థాపన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయంతోపాటు ఉప ఆలయాలను రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలకరించారు. ఉత్సవాల్లో మొదటి రెండు రోజుల భక్తుల రద్దీ సాధారణంగా ఉండే అవకాశం ఉంది. ప్రధానమైన చివరిరోజు 14న భక్తుల తాకిడి అధికంగా ఉండనుంది. అమ్మవారి జన్మదినమైన ఈ రోజు పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. వసంత పంచమిని పురస్కరించుకొని రాష్ట్ర ప్ర భుత్వం తరపున సరస్వతి అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పట్టు వస్త్రాలను సమర్పించ నున్నారు. చివరిరోజు రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

● ఆలయ ఈవో విజయ రామారావు

వసంత పంచమి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా చివరి రోజు బుధవారం భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది. అదనపు క్యూలైన్లను ఏర్పాటుచేసి వేచి చూసే భక్తులకు పాలు, బిస్కెట్లు, పంపిణీ చేయనున్నాం. ప్రభుత్వం తరపున మంత్రి కొండాసురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

వెంకటాద్రిపేట మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 11 : వెంకటాద్రిపేట మున్నూరు కాపు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గొజ్జ సుదర్శన్, ఉపాధ్యక్షులుగా కూన పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా మంగ్లారపు ప్రసాద్ బాబు, సంయుక్త కార్యదర్శిగా శివ కుమార్, కోశాధికారిగా గొజ్జ బాబు, దేవాలయ నిర్వాహకులుగా కూన చంద్రకాంత్ , కార్యవర్గ సభ్యులు ఏగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాసర సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

బాసర, ఫిబ్రవరి11: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ ఆదివారం బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ పండితులు ఆశీర్వదించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి అధికారులు, పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

● వేకువ జాము నుంచే బారులు తీరిన మహిళలు ● బోనాల సమర్పించేందుకు మూడు గంటల పాటు క్యూ


భైంసాలో బోనాలు సమర్పించేందుకు భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు


ముథోల్‌లో చలి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

భైంసా, ఫిబ్రవరి11: పట్టణంలోని పోచమ్మ ఆలయానికి ఆదివారం మహిళా భక్తజనం పోటెత్తింది. చలిబోనాలను పోచమ్మ తల్లికి సమర్పించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. వేకువ జాము 4.30 గంటల నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ రద్దీ అధికంగా ఉండటంతో మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో పూర్తయ్యాయి. బోనాల సమర్పణకు ఒక్కొక్కరికి 3గంటల సమయం పట్టిందంటే భక్తుల తాకిడి ఏవిధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతుంది. పుష్యమాసం అమావాస్య తదుపరి వచ్చే ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించడం అనాదిగా వస్తున్న అచారం. ఈ క్రమంలో ఆదివారం పట్టణ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన మూడున్నర వేలకు పైగా మంది మహిళలు స్థానిక మహాలక్ష్మీ మందిర ప్రాంతంలోని పోచమ్మ ఆలయాలనికి తరలివచ్చి బోనాలను సమర్పించారు. భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లితో పాటు మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. తమ కుటుంబ సభ్యులందరికి ఎలాంటి ఆపదలు వాటిల్లకుండా చూడాలంటూ, సుఖసంతోషాలు ప్రసాదించాలంటూ వేడుకుంటూ పూజలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు బో నాల సమర్పణలో మహిళలు ఎలాంటి ఇబ్బందు లు కలుగకుండా ఉండేందుకు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా వరుసలో వెళ్లి బోనాలు సమర్పించేలా క్యూలైన్ ఏర్పాటుచేయడం మూలంగా ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా కార్యక్రమాలన్నీ సజావుగా కొనసాగాయి. వాహనాలు అధికంగా రావడంతో పార్కింగ్‌సమస్య ఏర్పడింది.

ముథోల్: మండలకేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని చించాల, వెంటాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం చలిబోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు వేకువ జామున గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మి, పోచమ్మ తల్లి, ఊరడవ్వ, తదితర దేవతలకు బోనాలు సమర్పించారు. పంటలు బాగా పండాలని, ఇంటిల్లిపాది ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతలకు మొక్కుకున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో చలిబోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చలిబోనంతోపాటు వేడి తీపి, ఇతర నైవేద్యాలను గ్రామదేవతలకు సమర్పించి భక్తితో తమ మొక్కులను తీర్చుకున్నారు. ఇంటిల్లిపాదిని క్షేమంగా ఉంచాలని, పాడి పంటలు బాగా పండేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు.


దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పండిట్ దీన్ దయాల్‌కు ఘన నివాళులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 11: జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పండిత్ దీన్ దయాల్ 56వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమ య్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్ రెడ్డి, రామోజు నరేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అన్నిరంగాలకూ అన్యాయం

● ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

ముథోల్, ఫిబ్రవరి11: గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్నిరంగాల వారికి అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే పవర్ రామారావు అన్నారు. ఆదివారం ముథోల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తనవంతుగా పాటుపడతానని, సంఘ భవనానికి కామన్ డెవలప్మెంట్ ద్వారా నిధులు ఇవ్వనట్లు చెప్పారు. అదేవిధంగా బాసరలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉద్యోగులు కోరగా.. ఈ విషయాన్ని ప్రభుత్వం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి స్థలం ఇచ్చేందుకు పాటుపడతానన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో తన వాణిని విన్పిస్తానన్నారు. రిటైర్డ్‌ఉద్యోగులు శేషజీవితాన్ని ఆనందమయంగా గడపాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న, ముథోల్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, బాసర జడ్పీటీసీ వసంత, బాసర ఎంపీపీ విశ్వనాథ్ పటేల్, ఉద్యోగ సంఘం స్థానిక బాధ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.


ఎడ్‌బిడ్‌లో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

● అభివృద్ధి పనులకు భూమి పూజ

ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రూ.5లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ భూమి పూజ చేశారు. నాయకులు నిమ్మ పోతన్న, దత్తాత్రి, నర్సాగౌడ్, రమేష్, పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ముథోల్, ఫిబ్రవరి11: మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచే ఆయా గ్రామాల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు విద్యార్థులు తమ పోషకులతోని పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ఈపరీక్షా కేంద్రంలో 456 విద్యార్థులకు 431మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 19మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ అమృతయ్య తెలిపారు. ఈపరీక్షలు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగాయి.

నర్సాపూర్‌లో(జి)లో చిరుజల్లులు

నర్సాపూర్(జి), ఫిబ్రవరి11: మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షంతో రైతులు కంగుతిన్నారు. మొక్కజొన్న, జొన్న, శనగ పంటలకు వర్షం నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి11: మాజీ ప్రధాని పీవీ రామారావుకు భారత రత్న ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం నిర్మల్‌లోని ఆయన విగ్రహానికి బ్రాహ్మణ సంఘం పూలమాల వేసి ఘన నివాళులర్పించింది. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిశోర్, అధ్యక్షుడు పి.రమేష్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్, రాజేశ్వర్‌పాండే, గోవింద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

భైంసా, ఫిబ్రవరి 11: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జేకేఏఐ) ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ, అన్నబాహుల సాటే భవనంలో జరిగిన గ్రేడింగ్ పరీక్షలకు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 100కు పైగా మంది విద్యార్థులు హజరయ్యారు. కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు తేజేందర బాటియా, నిర్మల్ జిల్లా కరాటే శిక్షకులు రాజ్ కుమార్ పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగాయి. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 70మంది విద్యార్థులకు రెడ్, యెల్లో, ఆరేంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్ బెల్ట్‌లను ప్రధానం చేసి ధృవీకరణ పత్రాలు అందచేశారు. ఇందులో నిర్మల్ జిల్లా మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ సాయికృష్ణ, భైంసా కరాటే మాస్టర్స్ శివరాజ్ గౌడ్, లింగం, జ్ఞానతేజ, రాజశ్రీ, సాయినాథ్, నితిన్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి


మరియప్ప మృతదేహం

సారంగాపూర్, ఫిబ్రవరి 11: మండలంలోని జాం గ్రామ సమీపంలో గల చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాం గ్రామసమీపంలో గల చెరువులో మరియప్ప (37) చేపల వేటకు వెళ్లాడు. చెరువలో వల విసురుతుండగా కాలికి చుట్టుకోవ డంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.